క్లుప్తంగా

దైవ భక్తి పెంచుకోవాలి



వై కురవపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాల్లో నిస్సార్ అహ్మద్

రామసముద్రం : ప్రజలు మరింత భక్తి భావం పెంపొందించుకొని సుఖ శాంతులతో ఉండాలని వైఎస్సార్ సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని వై కురపల్లె, ఎర్రబోయిన పల్లె గ్రామాల్లోని శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. మండల కన్వీనర్ కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ శ్రీనివాస రెడ్డి, జిల్లా బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ గెవన్న, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి వీర గౌడు, యూత్ వింగ్ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలి



సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ఆర్టీసీ సిబ్బంది సమిష్టిగా పని చేసి ఆదర్శ డిపోగా తీర్చిదిద్దాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డిపో గేట్ నందు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. మార్చి నెలలో ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈపీకే,ఓఆర్‌లో రీజియన్‌లో మొదటి స్థానం తెచ్చారన్నారు. కెఎంపిఎల్‌లో రెండో స్థానం వచ్చిందన్నారు. అదే ఒరవడితో పని చేయాలన్నారు. ప్రతిభకనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తంబళ్లపల్లె : రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్ మోహన్, పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. మదనపల్లెలో ఆదివారం అన్నమయ్య జిల్లా జట్టు ఎంపికలో కన్నెమడుగు పాఠశాల క్రీడాకారులు బాలుర విభాగంలో యోగేంద్ర, బాలికల విభాగంలో ప్రణీత, సంధ్య స్టాండ్‌బైగా రిషితలు ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 26,27 తేదీల్లో మదనపల్లె వశిష్ట స్కూల్ మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని సర్పంచు శివమ్మ, ఎంపిటీసీ సభ్యులు మహేష్,అంతర్జాతీయ క్రీడాకారుడు మహమ్మద్‌యూసఫ్,ఉపాధ్యాయులు అభినందించారు.

మూగజీవాలకు సేవలు



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటితొట్టి

మదనపల్లె సిటీ : వేసవి కాలంలో మూగజీవాలకు సేవలు అందించేందుకు హెల్పింగ్‌మైండ్స్ సంస్థ సభ్యులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా సోమవారం మదనపల్లె-కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ని వానరాలకు ఆహారం అందజేశారు. వేసవి కావడంతో తాగేందుకు నీటితొట్టెలను ఏర్పాటు చేశారు. సభ్యులు అటవీ ప్రాంతంకు వెళ్లి పుచ్చకాయలు, ఇతర కాయలను ఆహారంగా అందజేశారు. నీటి తొట్టెలను ఏర్పాటు చేసి వాటిలో నీటిని నిల్వ ఉంచారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు అర్షియా, కిరణ్, సికిందర్, చైతు, చరణ్, రాబియా, అంజూమ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

గుర్రంకొండ : జనవాసాలు లేని చోట సిమెంటు రోడ్డు వేశారని ఆరోపిస్తూ మండలంలోని తరిగొండ గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంకు చేరుకొని గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం పక్కనే ఇటీవల సిమెంటు రోడ్డు నిర్మించారన్నారు. అయితే అక్కడ గతంలో ఎలాంటి వీధి లేకపోగా వ్యవసాయపొలాల నుంచి వచ్చే వర్షపునీటి వంక ఉండేదన్నారు. ప్రస్తుతం వంకను పూడ్చి వేసి రోడ్డు నిర్మించారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు ఇదేమార్గంలో ఇళ్లలేని చోట, జనావాసాలు లేని ప్రదేశంలో వ్యవసాయపొలాలకు వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేశారని వారు పేర్కొన్నారు. అసలు సిమెంటు రోడ్డు నిర్మించిన ప్రాంతలో ఒక్క ఇళ్లు కూడా లేదని కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారుల లాభం కోసం సిమెంటు రోడ్డు వేశారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.



కమనీయం.. సీతారాముల కల్యాణం

శ్రీరామనవమి బ్రహోత్సవాల్లో భాగంగా మదనపల్లె పట్టణం సొసైటీకాలనీని రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేక చలువ పందిళ్లు వేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు కోదండరామయ్య వేదమంత్రోచ్చారణలతో వివాహతంతు నిర్వహించారు. భక్తులు కల్యాణం చూసి పరవశించిపోయారు. ఉదయం ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనంపై ఊరేగించారు. ఊరేగింపు ఉత్సాహ భరితంగా జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

– మదనపల్లె సిటీ



తంబళ్లపల్లె అభివృద్ధిని అడ్డుకోవద్దు

- వైఎస్సార్‌సీపీ పాలనలో నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి
- పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపులు మానుకోవాలి
- సూపర్‌సిక్స్ పథకాల అమలుపై టీడీపీ దృష్టిపెట్టాలి
- కూటమిప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ నాయకుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో.. అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన తంబళ్లపల్లె నియోజకవర్గంపై కూటమిప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని, రాజకీయ కక్షలతో అభివృద్ధిని అడ్డుకోవద్దని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. సోమవారం మదనపల్లెలోని ఎంపీ మిథున్‌రెడ్డి కార్యాలయంలో తంబళ్లపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా..సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చలేదన్నారు. రెడ్‌బుక్ పాలన పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, పచ్చటి పల్లెల్లో ప్రశాంతతను భగ్నం చేస్తూ కక్షలు, ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారు. అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించకపోగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. డైవర్షన్ రాజకీయాలతో ప్రజలను మోసగిస్తూ పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ప్రజల సంక్షేమం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద ప్రజలు సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోనే వెనుకబాటుకు గురైన తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తూ అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తుంటే కూటమినాయకులు రాజకీయంగా ఆయనను ఎదుర్కోలేక దొడ్డిదారిన విమర్శించడం తగదన్నారు. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు, పొలానికి సాగునీరు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటే, రాజకీయ కక్షలతో అడ్డుకోవడం తగదన్నారు.

ముస్లింలకు కూటమి అన్యాయం

నియోజకవర్గంలో సాగు,తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, రాజకీయంగా నిలుపుదల చేయించారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపులకు పాల్పడుతూ, ప్రజల్లో ఎలాగైనా వారిని తక్కువ చేయాలని కుటిలప్రయత్నాలు చేస్తున్నారని, ప్రజాదరణలో వారికి ఎవరూ సాటి రారనే విషయాన్ని టీడీపీ నాయకులు గ్రహించాలన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం తంచనుగా అందితే, చంద్రబాబు పాలనలో పేదలు విద్య, వైద్యం కోసం తల్లడిల్లాల్సిన పరిస్థితి తలెత్తుతోందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో పేదవాడికి వైద్యం దక్కని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. టీడీపీ ప్రభుత్వం వక్ఫ్‌సవరణ చట్టానికి మద్దతు తెలిపి ముస్లిం సమాజానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమిప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ముస్లింలు ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించరని, భవిష్యత్తులో సరైన గుణపాఠం చెపుతారన్నారు. దేశంలో వృద్ధిరేటులో రాష్ట్రం రెండోస్థానంలో ఉందంటూ ఎల్లోమీడియా గొప్పగా కథనాలు వడ్డి వారించిందని, నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధింపుల్లో ప్రథమస్థానంలో ఉందన్న విషయం ఎందుకు ప్రచురించడం లేదన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధి విషయంలో టీడీపీ నాయకులు ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని, రెడ్‌బుక్ పాలనకు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడేది లేదని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, కురబలకోట, పీటీఎం, పెద్దమండ్యం ఎంపీపీలు భూదేవి, మహమ్మద్, పూర్ణికరమేష్, అనసూయ నారాయణరెడ్డి, బీసీ అధ్యక్షులు సాంబశివ, యువనాయకులు డి.హర్షవర్ధన్‌రెడ్డి, దండాలరవిచంద్రారెడ్డి, రెడ్డిశేఖర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ మహిళా రాష్ట్ర నాయకురాలు బీరంగిరేవతి తదితరులు పాల్గొన్నారు.

సంఘమిత్రల అవినీతిపై చర్యలు తీసుకోరా?

- ఏపీఎంను ప్రశ్నించిన సభ్యులు
- గతంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదంటూ ఆగ్రహం



సంఘమిత్రలపై చర్యలు తీసుకోవాలని ఏపీఎమ్‌ను కోరుతున్న సభ్యులు

గుర్రంకొండ : సంఘమిత్రలు చేస్తున్న అవినీతిపై ఎప్పటికీ చర్యలు తీసుకోరా, గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ సభ్యులు ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన గుర్రంకొండ మండల మీట్‌లో జరిగింది. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్యలపై ఎక్కువగా దృష్టి సారించి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. గుర్రంకొండలో ఆర్టీసీ బస్టాండు ప్రారంభించి చాలా రోజులు అవుతోందని, ఆర్టీసీ అధికారులు బస్టాండును వినియోగించుకొంటే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. సంఘమిత్రలు పలు అవినీతి పనులకు పాల్పడుతున్నారని, ఇష్టానుసారంగా డ్వాక్రా మహిళల దగ్గర డబ్బులు వసూలు చేసుకొంటున్నారని సభ్యులు ఆరోపించారు. బ్యాంకుల్లో మంజూరు చేయించే రుణాలకు సంబంధించి సభ్యుల దగ్గర లంచాలు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కొన్ని సంఘాల్లో సభ్యుల డబ్బులను స్వాహా చేసిన సంఘటనలు జరిగినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నించారు. ఏ సంఘమిత్ర పరిధిలో అవినీతి జరిగిందో చెబితే చర్యలు తీసుకొంటామని ఏపీఎం రజనీ కుమారి అన్నారు. రుణాల మంజూరులో మహిళా సభ్యులను సంఘమిత్రలు వేధింపులకు గురి చేస్తున్నారని గత మండలమీట్‌లో సంఘమిత్రల అవినీతిపై సంజాయిషీ అడిగినా ఇంతవరకు సమాధానమివ్వలేదని సభ్యులు ధ్వజమెత్తారు. మండలంలో ప్రతి సంఘమిత్ర పరిధిలో ఒక మహిళా సంఘాన్ని ఎంచుకొని విచారణ జరిపితే పూర్తి వివరాలు బయటకొస్తాయని సభ్యులు సూచించారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులైన సంఘమిత్రలపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆదేశించారు.

రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటిపట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరులో ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటిస్తామన్నారు. వంకపోరంబోకు, బీడు, వాగుపోరంబోకు, ప్రభుత్వస్థలాల్లో నివాసమున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వలేమన్నారు. గ్రామకంతంలో అందులోనూ ఎన్నో ఏళ్లు స్థిర నివాసం ఏర్పరుచకొని అర్హులైన వారికి మాత్రమే పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారులందరూ ఈనెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఏపీవో జయరామిరెడ్డి మాట్లాడుతూ మండలానికి గడ్డిపెంపకం కింద 300 యూనిట్లు మంజూరు ఆయ్యాయని, ఇప్పటి వరకు 21 యూనిట్లకు మాత్రమే అనుమతి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో సురేంద్రబాబు, వైస్‌ఎంపీపీ సరస్వతి, ఎంపీటీసీలు గంగులమ్మ, సరస్వతి, రాజగోపాల్, సర్పంచ్ రౌనక్‌భాషా, ట్రాన్స్‌కో ఏఈ మోసీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్‌స్వామి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆ ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించాలని ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న బీవైఎస్ నాయకులు

మదనపల్లె : పట్టణంలో ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారులపై ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటుచేసిన ప్రైవేట్ వ్యక్తులకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లు తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని బహుజన యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ పట్టణంలో పలుచోట్ల ముఖ్యంగా సీటీఎం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ప్రైవేట్ బిల్డింగ్స్, ఆసుపత్రి యాజమాన్యాలు, కమర్షియల్ పర్పస్ కోసం తీసుకున్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను వారి సొంత స్థలంలో నిర్మించుకోకుండా, రోడ్డుకు అడ్డంగా నిర్మించి ట్రాఫిక్ కి తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బహుజన్ యువసేన నాయకులు ఆది, నాగార్జున, శశి కుమార్, బాలకృష్ణ, వినయ్, కుమార్, ఉదయ్, దినేష్, బాలు, రాజేష్, దేవేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం తొలగింపుపై నిరసన




మదనపల్లె : తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాలమహానాడు ధర్నా

మదనపల్లె : పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం కలకటవారిపల్లెలో రెండేళ్ల కిందట ఏర్పాటుచేసిన డాక్టర్.బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించిన తహసీల్దార్, సీఐ, ఎస్‌ఐలపై చట్టరీత్యాచర్యలు తీసుకోవాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలాసుదర్శనం డిమాండ్ చేశారు. సోమవారం మదనపల్లె మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాలమహానాడు సభ్యులతో కలిసి అధికారుల తీరుకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యమలా సుదర్శనం మాట్లాడుతూ...కలకటవారిపల్లెలో ప్రజలందరి సమక్షంలో రెండేళ్ల క్రితం ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రోద్బలంతో అధికారులు తొలగించడం చేశారన్నారు. మాలమహానాడు నాయకులు యమలాచంద్రయ్య, గుండామనోహర్, మల్లెలమోహన్, వీరనాల మాణిక్యం, లక్ష్మీపతి, అప్పయ్య, పెద్దపోడు, గురుమూర్తి, భాస్కర్, గంగరాజు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర మాలమహానాడు కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణి కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏఎస్‌వో రామ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కృష్ణయ్య, సుభాష్, బోదేషావలి, మల్లికార్జున, రాజేశ్వరి, ఆనంద్, ప్రసాద్, రెడ్డిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనశైలితో ఆరోగ్యం



పీలేరు : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బంది

పీలేరు : మంచి జీవనశైలితో ఆరోగ్యం సిద్ధిస్తుందని పీలేరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం పీలేరులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అలసట నుంచి ఆరోగ్యం వైపు' ప్రత్యేక నినాదం సిద్ధించాలంటే మంచి జీవనశైలితో జీవన నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ ఎడ్యుకేటర్ కొండయ్య, ఏఎన్‌ఎం భార్గవి, ధనభాగ్యమ్మ, విజయ, ప్రమీల, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : ప్రజలు ఆరోగ్యం పై మరింత శ్రద్ధ చూపాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సనా ఉన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ వరకు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు. సిహెచ్‌ఓ ఇంద్రావతి, పీహెచ్‌ఎన్ సరోజ, హెల్త్ సూపర్వైజర్లు దేవేంద్ర, దేవకుమారి, ఎమ్.ఎల్.హెచ్.పిలు, ఏఎన్‌ఎం గాయత్రి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే చింతల



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి : పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ స్థితిగతులు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలు, వైఎస్సార్‌సీపీతో పాటు అనుబంధ విభాగాల నూతన కమిటీల నియామకం తదితరాలపై మాజీ మంత్రితో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. మాజీ మంత్రి ఆరోగ్య స్థితిపై విచారించి, పూర్తి స్థాయిలో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆశీర్వాదం

వాల్మీకిపురం పట్టణం కొత్తపేట వీధికి చెందిన నారాయణ కుమార్తె ప్రియాంక నిశ్చితార్థ కార్యక్రమం స్థానిక ఆర్‌ఎం కింగ్ ప్యాలెస్‌లో జరిగింది. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వధూవరులను ఆశీర్వదించి అభినందనలు తెలియచేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, టెలికాం కమిటీ అడ్వైజర్ శ్రీధర్‌రాయల్, వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, చంద్రాచారి, వితలం సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి



విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు రూరల్ : రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ పుట్టావాండ్లపల్లె వద్ద రూ. 3.50 కోట్లతో 33/11 ఏవీ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో రూ. 40 లక్షలతో సీసీ రోడ్లు, తాగునీటికి రూ. 3 లక్షలతో బోరు, మోటారు ప్రారంభించారు. అనంతరం పీలేరు పట్టణంలో ఈద్గా ఆవరణలో రూ. 20 లక్షలతో సీసీ ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య అధిగమించేందుకు కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు చేశామన్నారు. కడప జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి రూ. 1800 కోట్లతో పీలేరు నియోజకవర్గానికి తాగునీటి సరఫరాకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ వై. చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామ్మూర్తి, రెడ్డిబాషా, లద్దూజాఫర్, షౌకత్, చాపల సూరి, రియాజ్, రాజ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు

మదనపల్లె : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, శ్రామిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, కార్పొరేట్ వర్గానికి సంపదను దోచిపెడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీపీఐ జాతీయసమితి పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు బీజేపీ ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఏప్రిల్ 9న మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొడుతూ, మతసామరస్యాన్ని దెబ్బతీస్తూ, మత రాజకీయాలు చేస్తూ, రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నోట్ల రద్దుతో ప్రారంభమైన బీజేపీ కార్పొరేట్ విధానాలు నేటి వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణ వరకు గమనిస్తే..మత విద్వేషాలకు దారితీసే అంశాలు ఉన్నాయన్నారు.ఏప్రిల్ 9న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాకు ప్రజలు, కార్మికులు, కర్షకులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తిచేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణప్ప, సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కే.మురళి, సూరి, తిరుమల పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

పెద్దతిప్పసముద్రం : ప్రభుత్వ చట్టాలను ధిక్కరించినా, నిబంధనలకు తూట్లు పొడిచినా కేసులు తప్పవని ఎస్‌ఐ హరిహర ప్రసాద్ ప్రజలకు హెచ్చరించారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు చోట్ల వాహనాల్లో డీజేలు ఏర్పాటు చేసారని తెలుసుకున్న ఎస్‌ఐ ఘటనా స్థలాలకు వెళ్ళి డీజే వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా ముందస్తుగా పోలీసుల అనుమతులు పొందాలని నిర్వాహకులను హెచ్చరిస్తూ ఇలాంటి ఘటనలు పునరావృత్తం అయితే కేసు నమోదు చేస్తామని సూచిస్తూ సోమవారం వాహనాలను వదిలేశారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వార్షిక పరీక్షలు (సమ్మేటివ్ అసెస్‌మెంట్-2) సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాలకు మంగళవారం కరెంటు సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఎఈ మోసీన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చెర్లోపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెయింటెన్స్ పనులు చేపడుతున్నామని అన్నారు. దీని కారణంగా మండలంలోని చెర్లోపల్లె, నడిమికండ్రిగ, టి.పసలవాండ్లపల్లె పంచాయతీలతో పాటు గెరికుంటపల్లె ఫీడర్‌లో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నాని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

పెద్దతిప్పసముద్రం : మండల డిస్కం ఏఈగా గిరిధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో బి.కొత్తకోటలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్నాళ్ళూ ఇక్కడ ములకలచెరువులో పని చేస్తున్న రామలక్ష్మయ్య ఇన్‌చార్జి ఏఈగా ఉండేవారు.

జూదరుల అరెస్ట్

బి.కొత్తకోట: స్థానిక పీటీఎంరోడ్డులో పేకాట జూదం ఆడుతున్న ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ భాస్కర్ నాయక్ తెలిపారు. వీరినుంచి రూ.32,500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.


ట్యాబ్‌లు అందజేత

పెద్దతిప్పసముద్రం: 'పరీక్షలు ముగిసినా అందని ట్యాబ్‌లు' అని ఈ నెల 6న సాక్షి పత్రికలో వెలువడిన వార్తపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఎంఈఓల ఆదేశాల మేరకు పది పబ్లిక్ పరీక్షలకు ముందు విద్యార్థుల నుంచి అయ్యవార్లు తీసుకున్న ట్యాబ్‌లను సోమవారం ఆయా హైస్కూళ్ళలోని పిల్లలకు అందజేశారు.

● బ్రహ్మ రథోత్సవం

పెద్దతిప్పసముద్రం మండలంలోని బూచిపల్లిలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో రెండు రోజులుగా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం బ్రహ్మ రథోత్సవం కనుల పండువగా సాగింది. స్వామి వారి ఉత్సవ మూర్తులను పుష్పాలతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. గ్రామం నుంచే కాక చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆ ప్రాంతమంతా గోవింద నామ స్మరణతో మార్మోగింది. మంగళవారం పుష్ప పల్లకీ కార్యక్రమం జరుగునని నిర్వాహకులు పేర్కొన్నారు.

– పెద్దతిప్పసముద్రం



● అన్నాభిషేకం

పెద్దతిప్పసముద్రంలోని శివాలయంలో సోమవారం లండన్‌కు చెందిన సనగరం లక్ష్మీనరసింహ దంపతుల ఆధ్వర్యంలో అన్నాభిషేకం కార్యక్రమం జరిగినట్లు శివాలయం సేవకులు పట్టాభిరామయ్య తెలిపారు. ఆలయంలో వివిధ రకాల పూజలు, అభిషేకాల అనంతరం భక్తులకు యూఎస్‌లో ఉంటున్న మదకశిర వెంకటేష్ కుటుంబీకులు అన్నదాన సౌకర్యం కల్పించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

– పెద్దతిప్పసముద్రం

